భారత గణతంత్రమే ఘనమని అందర్నీ నమ్మిస్తుండే మేధావులను ఇబ్బంది పెట్టే ప్రతిపాదనలు చాలానే ఉన్నాయీ పుస్తకంలో. ముందే మూతి ముడుచుకుని ముఖం తిప్పకుండా శ్రద్ధగా చదవటం అవసరం.

– అరుంధతీ రాయ్



The Indian Ideology

# ఇండియాలో దాగిన హిందుస్థాన్

## పెరి ఆండర్‌సన్

కశ్మీర్ విషయంలో భారత కప్పదాట్లను, వక్రీకరణలను పెరీ ఆండర్‌సన్ ఎత్తిచూపితే సమాధానం లేదు. దేశ విభజనలో గాంధీ, నెహ్రూల పాత్రను సోదాహరణంగా వివరించటమూ వారి అభిమానుల్ని ఇబ్బందిపెట్టేదే!

-పంకజ్ మిశ్రా

# ఇండియాలో దాగిన హిందూస్థాన్

# The Indian Ideology

పెరి ఆండర్సన్

తెలుగు : ప్రభాకర్ మందార

హైదరాబాద్ బుక్ ట్రస్ట్

| | | |
|---|---|---|
| ధర | : | రూ. 150/- |
| మొదటి ముద్రణ | : | September, 2014 |
| ఆంగ్లమూలం | : | The Indian Ideology, Perry Anderson, Three Essays Collective, Gurgaon (Haryana), October 2012, © Perry Anderson |
| ప్రతులకు, వివరాలకు: | | హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ప్లాట్ నెం. 85, బాలాజీ నగర్, గుడిమల్కాపూర్, హైదరాబాద్ - 500 006 ఫోన్ : 040 23521849 www.hyderabadbooktrust.blogspot.com |

| | | |
|---|---|---|
| ముద్రణ | : | అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ, 126 శాంతినగర్, హైదరాబాద్ - 28 ఫోన్ : 23391364, 23304194 Email: anupamaprinters@yahoo.co.in |

# విషయసూచిక


| | | |
|---|---|---|
| | ప్రచురణకర్తల మాట | vi-vii |
| | ముందుమాట | viii-xi |
| 1. | స్వాతంత్ర్యం | 1 |
| 2. | దేశ విభజన | 39 |
| 3. | గణతంత్రం | 87 |
| | పరిశీలించిన పుస్తకాల జాబితా | 159 |

# 1 స్వాతంత్ర్యం

'ఒక సంస్కృతి లేదా నాగరికత ఐదారు వేల సంవత్సరాలపాటు– అది కూడా ఘనీభవించినట్టో, మార్పు లేకుండానో కాకుండా నిరంతరాయంగా కొనసాగుతూ రావడం నిజంగా ఆశ్చర్యంపరిచే విషయం. పైగా ఈ సుదీర్ఘకాలంలో భారతదేశం ఎప్పటికప్పుడు పరివర్తన చెందుతూ వచ్చింది' అన్నారు స్వాతంత్ర్యం రావడానికి కొన్నేళ్ల ముందు ఆనాటి భావి భారత ప్రధాని. భారత ఉపఖండపు ప్రాచీనతలో 'ఏదో విలక్షణత్వం' వుంది, 'అద్భుతమైన ఏకత్వం' వుంది, ఇక్కడ నివసించే ప్రజలను అది 'తరతరాలుగా ఒకే జాతీయతతో, ఒకేరకమైన నైతిక, మానసిక గుణాలతో' భారతీయులుగా నిలబెడుతోంది' అన్నారు. నిజానికి 'నాగరికత ఆవిర్భవించినప్పుడే భారతీయ ఆలోచనను ఈ ఐక్యతా స్వప్నం ఆవహించింది' అన్నారు నెహ్రూ.[1]

ఈవిధమైన దేశభక్తి పూరితమైన పగటికలలను ఆయన అభిమానులే కాదు, ఆయన విమర్శకులు కూడా కంటున్నారు. నెహ్రూకు ఢిల్లీలో ప్రస్తుత (2012) రాజకీయ వారసుడైన మన్మోహన్ సింగ్ 'భారత స్వాతంత్ర్యోద్యమానికి సాటిరాగలిగిన ఉద్యమం చరిత్రలో మరొకటి లేదనీ, సామాజిక ప్రజాస్వామ్యంలో భారత రాజ్యాంగం ఒక సాహసోపేతమైన రచన' అనీ అన్నారు.[2] తమ మాతృభూమి గొప్పదనాన్ని కొనియాడేందుకు భారతీయ మేధో వర్గం కూడా పోటీలు పడుతుంటుంది. మేఘనాథ్ దేశాయ్ తన 'రీ డిస్కవరీ ఆఫ్ ఇండియా'లో భిన్నత్వాన్ని ఏకత్వంగా తీర్చిదిద్దిన ఆధునిక భారతదేశ 'విజయ గాథ' నిజంగా ఒక అద్భుతం' అని రాశారు. రామచంద్ర గుహ 'ఏ నేషన్ కన్జ్యూమ్డ్ బై ది స్టేట్' అన్న శీర్షికతో అవుట్‌లుక్ పత్రికలో రాసిన వ్యాసంలోనూ, 'ఇండియా ఆఫ్టర్ గాంధీ' అన్న పుస్తకంలోనూ ఇలా పేర్కొన్నారు: 'భారత దేశ విశిష్టత దాని కరెన్సీ నోట్ల మీద ప్రతిబింబిస్తుంది. ఒక పక్క గాంధీ బొమ్మ మరో పక్క ఆ నోటు విలువను తెలుపుతూ 17 భాషల్లో ముద్రించబడి వుండే అక్షరాలు ఆ విశిష్టతను చాటిచెబుతుంటాయి. బహు భాషలు,

---

1. జవహర్‌లాల్ నెహ్రూ, 'ద డిస్కవరీ ఆఫ్ ఇండియా', న్యూయార్క్ 1946, పే. 38,40,47,50.
2. మన్మోహన్ సింగ్, 'ఏన్ ఇండియన్ సోషల్ డెమాక్రసీ: ఫ్రమ్ పొలిటికల్ విజన్ టు ప్రాక్టికల్ పాజిబిలిటీ', ఇందిరా గాంధీ కాన్ఫరెన్స్ 19 నవంబర్ 2010, పే.4,1. జాతీయోద్యమం వల్ల ఏదైనా అసౌకర్యం కలిగితే మన్నించాలని ఇదే పాలకుడు మరో సందర్భంలో బ్రిటిష్‌ను క్షమాపణలు కోరారు.

అనేక మతాలు, జాతులతో కూడిన రాజకీయ ఆర్థిక వ్యవస్థను రూపొందించుకోవాలన్న ఆలోచన యూరప్‌కు కలగడానికి యాభై ఏళ్ల ముందే భారతదేశం దానిని సాకారంచేసుకుంది.' ప్రతాప్ భాను మెహతా తన 'ద బర్డెన్ ఆఫ్ డెమాక్రసీ' పుస్తకంలో 'మానవేతిహాసంలో భారతప్రజాస్వామ్యంలాంటి ఉదాహరణ మరొకటి కనిపించదు' అన్నారు. అమర్త్యసేన్ తన 'ది ఆర్గ్యుమెంటేటివ్ ఇండియన్'లో 'ముఖ్యంగా వేలాది సంవత్సరాల సంప్రదాయంలో మేధోపరమైన విభిన్న ఆలోచనలపట్ల సహనశీలతతో సార్వజనిక తర్కాలు జరుపడం ఈ దేశపు ప్రత్యేకత, పాశ్చాత్యేతర ప్రపంచంలో ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని తిరుగులేకుండా ఎంచుకొన్న మొట్టమొదటి దేశం భారతదేశమే' అన్నారు. సునీల్ ఖిల్నాని తన 'ది ఐడియా ఆఫ్ ఇండియా'లో 'ప్రపంచవ్యాప్తంగా పద్దెనిమిదవ శతాబ్దం చివరి నాటికి సంభవించిన అమెరికన్, ఫ్రెంచ్ విప్లవాల తర్వాత మూడో అతిపెద్ద సంఘటన భారతదేశంలో ప్రజాస్వామిక ప్రయోగమే. ఈ దేశ జనాభా రీత్యా, విస్తీర్ణం రీత్యా ఆ రెండు విప్లవాలకన్నా ఇదే మహత్తరమైంది అన్నారు. స్వేచ్ఛ విషయంలో భారత దేశం ఆసియా ఖండంలోనే అగ్రగామి అనీ, మొత్తం ప్రపంచంలోనే ఆసక్తికరమైన దేశమనీ, దీనికి సంబంధించిన ఏ చిన్న అంశమైనా ప్రశంసనీయమైనదేననీ అన్నారు. స్వాతంత్ర్యానంతరం సంస్థానాలను విలీనం చేసుకోవడం ఈ దేశం సాధించిన ఒక 'గొప్ప విజయం' అన్నారు. భారతదేశ విదేశాంగ విధానం 'అత్యంత విశిష్టమైనది' అన్నారు. నెహ్రూ భారత ప్రజల హృదయాలలో జార్జివాషింగ్‌టన్, అబ్రహాం లింకన్, రూజ్‌వెల్ట్, ఐసెన్‌హోవర్‌ల సమిష్టి స్వరూపం' అని పేర్కొన్నారు.

అన్ని దేశాలకూ తమకు అమిత ఇష్టమైన ప్రతీకలుంటాయి. పెద్ద దేశాలకు అనివార్యంగా మిగతావాటికంటే పెద్ద ప్రతీకలుంటాయి. పైన పేర్కొన్న వ్యాఖ్యాతలందరూ తమ కాలంలో సుప్రసిద్ధులైన భారతీయ మేధావులు. వాళ్లు రచించిన పుస్తకాలేమీ ఆషామాషీగా రాసినవికావు. అవి ఎంతో శ్రద్ధగా చేసిన మేధోపరమైన అధ్యయనాలు. భారతదేశాన్ని అర్థం చేసుకోవాలంటే వాటిని తప్పనిసరిగా చదవాలి. జవహర్‌లాల్ నెహ్రూ మొదలుకుని మన్మోహన్ సింగ్ వరకూ భారత దేశం గురించి చేసిన విశ్లేషణల్లో భారతదేశ స్వరూపాన్ని సాధికారికంగా, సంక్షిప్తంగా సూచించే ప్రధానమైన నాలుగు జంటపదాలు కనిపిస్తాయి. అవి: 1) ప్రాచీనత-అవిచ్ఛిన్నత 2) భిన్నత్వం-ఏకత్వం 3) అపారమైన జనాభా-ప్రజాస్వామ్యం 4) బహుళ మతాలు-లౌకికవాదం. విస్తృతిలో, ఉద్వేగపూరిత భావనలో భారత స్వాతంత్ర్యోద్యమానికి సమానమైన ఉద్యమం మరొకటి లేదు. పై నాలుగు జంట పదాలూ భారతీయ భావనకు పవిత్రమైన ప్రతీకలు. వీటన్నింటినీ అందరూ అంగీకరించకపోయినా కొన్నింటి విషయంలో ఏకాభిప్రాయం వుంది. అయితే ఆ ఏకాభిప్రాయాలు ఏ వాస్తవాలకు సంబంధించినవి?

## 1

బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాగిన జాతీయోద్యమంలో కాంగ్రెస్ పార్టీ అవగాహన ప్రకారం, గాంధీ మాటల్లో చెప్పాలంటే 'భారతదేశం ప్రకృతి సహజంగా ఏర్పడిన ఒక అవిభాజ్యమైన భూభాగం', 'బ్రిటిష్‌వాళ్లు ఈ దేశానికి రాకముందే అంటే పురాతనకాలం నుంచే భారతీయులంతా ఒకే జాతిగా వున్నారు'. 'మిగతా ప్రపంచానికి అసలు జాతీయత అంటే ఏమిటో తెలియకముందే ఇక్కడ జాతీయత ఉజ్వలంగా వుంది. భారతీయులంతా ఒక్కటిగా వున్నారు. కానీ, ఏ ఇద్దరు ఇంగ్లీషువాళ్లూ ఒక్కటిగా లేరు' .[3] నెహ్రూ అయితే ఈ 'ఏకత్వ భావన' ఆరువేల ఏళ్ల క్రిందటి నుంచే వుందని చెప్పారు. రెండో ప్రపంచ యుద్ధానికి ముందరి 'ది యునిటీ ఆఫ్ ఇండియా' వంటి రచనలు చేసిన నాటినుంచీ చైనాతో సరిహద్దు వివాదాలు చెలరేగిననాటి (1962) వరకూ నెహ్రూ ఇదే ధోరణితో వున్నారు. భారత విదేశాంగ శాఖ ఇదే వాదన చేసింది. మహాభారతాన్ని ఉదాహరణగా పేర్కొంటూ ఈశాన్య రాష్ట్ర ప్రాంతాలు కూడా అనాదిగా ఇండియాలో అంతర్భాగంగా వున్నాయంటూ వాదించింది. ఈవిధమైన భావనలు ఇప్పటికీ ఇంకా కొనసాగుతూనే వున్నాయి. అయితే వాస్తవాలు మాత్రం వేరు. మనకు తెలిసినంతవరకూ భారతదేశం నిన్నమొన్నటి దాకా రాజకీయంగాగానీ, సాంస్కృతికంగాగానీ ఈనాడున్నవిధంగా ఏనాడూ లేదు. సుదీర్ఘ చరిత్రలో భారతదేశం వేరు వేరు రాజ్యాలుగా వుంటూ వచ్చింది. నెహ్రూ తన 'డిస్కవరీ ఆఫ్ ఇండియా'లో ప్రస్తావించినట్టు మూడు అతిపెద్ద సామ్రాజ్యాల కాలంలో కూడా ఈ దేశం పూర్తిగా ఒక్కటిగా లేదు. మౌర్య, మొఘల్ సామ్రాజ్యాల కాలంలో భారతదేశ సరిహద్దులు అటు ఇప్పటి అఫ్ఘనిస్థాన్ వరకు విస్తరించినా ఇటు దక్కన్ దాటి కిందకు వెళ్లలేదు. మరోపక్క మణిపూర్ వరకూ కూడా చేరలేదు. ఇక గుప్త సామ్రాజ్య పరిధి అయితే మరింత చిన్నది. ఈ మూడు సామ్రాజ్యాల మధ్య ఐదువందల నుంచి వెయ్యి సంవత్సరాల ఎడం వుంది. వాటిమధ్య చెప్పుకోదగ్గ రాజకీయ లేదా సాంస్కృతిక సంబంధాలేమీ లేవు. మౌర్య సామ్రాజ్యకాలంలో బౌద్ధమతం విలసిల్లితే, గుప్తుల కాలంలో హిందూ మతం వర్థిల్లింది. మొఘలుల కాలంలో ముస్లిం మతం రాజ్యమేలింది. ఈ మహా సామ్రాజ్యాల మధ్య కాలంలో చాలా వరకు చిన్న చిన్న ప్రాంతీయ పాలకులు ఎప్పుడూ మారుతూవచ్చారు. ఆ సమయంలో సామాజిక పద్ధతులు, కులం, సాంస్కృతిక విధానం కొనసాగేవి కానీ అవి ఎప్పుడూ ఒకే విధంగా మాత్రం లేవు. అసలు 'ఇండియా అన్న భావన' యూరప్ నుంచి సంక్రమించిందే తప్ప స్థానికంగా రూపుదిద్దుకున్నది కాదు. ఆ పేరే ఈ వాస్తవాన్ని స్పష్టం చేస్తోంది. ఇండియా అన్న పేరుగానీ లేదా తత్సమానమైన ఇతర పేరుగానీ ఏ భారతీయ భాషలోనూ కనిపించదు. సింధూ

---

3. గాంధీ, 'హింద్ స్వరాజ్ ఆర్ ఇండియన్ హోం రూల్', 14వ పునర్ముద్రణ, అహ్మదాబాద్ 2001, పే. 40–41. ఈ పుస్తకం 1909 వెలువడింది.

నదిని (ఇండస్) ప్రాతిపదికగా తీసుకుని గ్రీకులో ఈ పదం సృష్టించబడింది. 16వ శతాబ్దం నాటి వరకూ ఇండియా అన్న పదం ఈ ఉపఖండానికి పరాయిదిగానే వుంది. యూరోపియన్లు అమెరికన్ మూలవాసుల్ని సంబోధించినట్టే భారతీయులనందరినీ కలిపి ఆనాడు 'ఒక అపరిచితదేశ ప్రజలు' అనేవారు.[4]

బ్రిటిష్‌వాళ్లు వచ్చినప్పుడు ఈ ప్రదేశమంతా చిన్న చిన్న రాజ్యాలుగా చీలికలుపేలికలుగా వుంది. అందువల్లనే వాళ్లకి ఈ ప్రాంతాన్ని జయించి తమ అధీనంలోకి తీసుకోవడం చాలా సులభమయింది. ఒక రాజ్యానికి వ్యతిరేకంగా మరొక రాజ్యాన్ని రెచ్చగొట్టి, ఒకళ్లమీదకు మరొకళ్లను ఉసిగొల్పి, వివిధ ఒప్పందాలనూ, సంధులనూ కుదుర్చుకుంటూ – ప్లాసీ యుద్ధం తరువాత బ్రిటిష్‌వాళ్లు ఒక శతాబ్దకాలంలో గతంలో ఇక్కడ ఏ సామ్రాజ్యమూ లేనంత విశాలంగా తూర్పు నుంచి దక్షిణాదివరకూ తమ పాలనను విస్తరించగలిగారు. వాయవ్య దిశలో ఈ విస్తరణ కొంత తక్కువగా జరిగింది. సుప్రసిద్ధ స్థానిక చరిత్రకారుడు బి.బి.మిశ్రా తన 'ది యునిఫికేషన్ అండ్ డివిజన్ ఆఫ్ ఇండియా'లో ఇలా అన్నారు: 'భారతదేశంలో ముక్కలు ముక్కలుగా వున్న సమాజం, ఒక జాతీయత అనేది లేని ప్రభుత్వాలు బ్రిటిష్‌ను ఏమాత్రం ఎదిరించలేకపోయాయి. వాస్తవానికి భారతీయ సైనికబలగాలే బ్రిటిష్‌వారి తరఫున యుద్ధంచేసి ఈ దేశాన్ని వారికి అందించాయి.'[5] ఇందులో కొంత అతిశయోక్తి, మరికొంత కాల గణన దోషం కనిపించవచ్చు. కానీ ఇది ఒక ప్రాథమిక సత్యాన్ని చాటిచెబుతోంది. భారత ఉపఖండానికి విదేశీ దండయాత్రలు కొత్తేమీ కాదు. ఇక్కడి ఉత్తరాది మైదాన ప్రాంతాల మీద పదవ శతాబ్దం నుంచే వరుస దండయాత్రలు మొదలయ్యాయి. కాబట్టి ఇదివరకటి పాలకుల కంటే బ్రిటిష్‌వాళ్లు మరీ కొత్తవాళ్లేమీ కాదు. అయితే కొత్తగా దండయాత్ర చేసేవాళ్లకి ఎప్పుడైనా తమ సొంత సైనిక బలగాలు తప్పనిసరి. ఇంత సువిశాలమైన భూభాగాన్నీ, జనాన్నీ బ్రిటిష్‌వాళ్లు అదుపులో ఉంచుకోగలిగారంటే అందుకు కారణం జాతులు, భాషలు, రాజులు, సమాజాలు, విశ్వాసాలు మొదలైనవాటి పేరిట ఈ ప్రదేశం ఎక్కడికక్కడ చీలిపోయి వుండటమే.

ఈస్టిండియా కంపెనీ బెంగాల్‌ను స్వాధీనం చేసుకున్న తరువాత దాదాపు వంద సంవత్సరాలపాటు కంపెనీ సైన్యంలో తెల్లవారికంటే నల్లవారి (భారతీయుల) సంఖ్యే ఎక్కువగా 1:6 నిష్పత్తిలో వుంటూ వచ్చింది. అయితే 1857 నాటి సిపాయిల తిరుగుబాటు దెబ్బకు

---

4. ఐన్‌స్లీ ఎంబ్రీ, 'ఇమాజినింగ్ ఇండియా, ఎస్సేస్ ఆన్ ఇండియన్ హిస్టరీ', ఢిల్లీ, న్యూయార్క్ 1989, పే.3,14–16. పర్షియన్లు సింధూ నది అవతలిపక్కనున్న ప్రదేశాన్ని హిందూస్థాన్ అని సంబోధించడాన్ని గమనించి గ్రీకులు ఇండియా అన్న పదాన్ని రూపొందించారు. ఆ తరువాత ఈ పదాన్ని మొఘల్స్ ఎక్కువగా ఉపయోగించారు.
5. బి.బి.మిశ్రా, 'ది యునిఫికేషన్ అండ్ డివిజన్ ఆఫ్ ఇండియా', ఢిల్లీ 1990, పే. 64.

ఒక్కసారిగా ఆ నిష్పత్తి తారుమారైంది.[6] అప్పటి నుంచీ బ్రిటిష్ ప్రభుత్వం భారత దేశంలోని తన సైన్యంలో ప్రతి ఇద్దరు నల్లవారికి ఒక తెల్లవాడు వుండేలా జాగ్రత్తపడింది. సైనికులలో స్థానిక అభిమానాలూ, ఉమ్మడి గుర్తింపులూ పెరగకుండా చర్యలు తీసుకుంది. బ్రిటిష్ ప్రధాని పాల్మర్‌స్టన్ కాలంలో భారత కార్యదర్శిగా పనిచేసిన వుడ్ ఈ వ్యూహం వెనక వున్న ఉద్దేశాన్ని ఇలా కుండబద్దలు కొట్టినట్టు చెప్పాడు: “సైన్యంలోని వివిధ రెజిమెంట్ల మధ్య పరస్పర శత్రుభావనతో కూడిన పోటీ తత్వం వుండాలని నేను కోరుకుంటున్నాను. అలా వుంటేనే సమయం వచ్చినప్పుడు సిక్కు సిపాయీలు హిందువుల మీదా; గూర్ఖా సిపాయిలు హిందువులమీదా, సిక్కులమీదా ఎలాంటి సంకోచం లేకుండా కాల్పులు జరపగలుగుతారు.”[7] ఇదే విషయంపై ఈడెన్ కమిషన్ (1879) ఇలా వ్యాఖ్యానించింది: “భారతదేశంలో భారీ స్థాయిలో భారతీయ సైన్యం లేకుండా మనం మనుగడ సాగించచడం సాధ్యంకాదు. అయితే ఆ సైన్యానికి ప్రతిగా మనం తగిన సమాంతర యురోపియన్ సైన్యాన్ని కూడా సిద్ధంగా వుంచుకోవాలి. దానితోపాటు స్థానిక సైన్యంలో పరస్పర ప్రతికూల శక్తులను పెంపొందించాలి. సైన్యంలో వైవిధ్యం చాలా ముఖ్యం. అది ఒక దేశ (ఈ పదాన్ని గమనించండి) ముస్లింలలో మరో దేశ ముస్లింల పట్ల వ్యతిరేకతనూ, భయాన్నీ, అయిష్టతనూ పెంచిపోషిస్తుంది'.[8] ఆనాటి ఢిల్లీ సిపాయిలు మొఘల్ సామ్రాజ్యం పునరుద్ధరించబడాలని కోరుకున్నారు. అందువల్లనే సైన్యంలో ముస్లింల నియమాకాలు అనుమానాస్పదంగా మారాయి. ప్రత్యేక గుర్తింపు వున్న సైన్యంలో ముస్లింలను అరుదుగా తీసుకునేవారు. ఒక యూనిట్‌లో మొత్తం ముస్లిం సైనికులు వుండడాన్ని ఏనాడూ అనుమతించలేదు. వుడ్ చెప్పినట్టు బ్రిటిష్ ప్రభుత్వం శిక్కులను, గూర్ఖాలను ఇతర్ల కంటే ఎక్కువగా నమ్మింది. ఆ రెండు వర్గాలూ సంఖ్యా పరంగా చిన్నవి. వారి తర్వాతి స్థానంలో పఠాన్లు, పంజాబీలు వుండేవారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్య వర్గాల వారే ఎక్కువగా సైన్యంలో చేరేవారు. కొద్దిపాటి పొలాలున్న బీద రైతులకు సైన్యంలో ప్రాధాన్యత లభించేది.[9] ఫ్రెంచి వలసవాద

---

6. సిపాయిల తిరుగుబాటు (మ్యూటినీ) అన్నది తమ సౌలభ్యం కోసం పరిమితార్థంతో ఉపయోగించిన పదం. నిజానికి అది బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా విస్తృత స్థాయిలో పెల్లుబికిన సామూహిక తిరుగుబాటు. అది కేవలం సిపాయిలకు మాత్రమే పరిమితం కాలేదు. దాని ప్రాధాన్యతను ఎవరైనాసరే గుర్తించక తప్పదు.
7. హీరా లాల్ సింగ్, 'ప్రాబ్లమ్స్ అండ్ పాలసీస్ ఆఫ్ ది బ్రిటిష్ ఇన్ ఇండియా 1885–1898', లండన్, 1963, పే. 140.
8. స్టీఫెన్ కోహెన్, 'ది ఇండియన్ ఆర్మీ, ఇట్స్ కాంట్రిబ్యూషన్ టు ద డెవలప్‌మెంట్ ఆఫ్ ఎ నేషన్', ఢిల్లీ 1990, పే. 38–39.
9. డేవిడ్ ఒమిస్సీ, 'ద సిపాయ్ అండ్ ద రాజ్, ది ఇండియన్ ఆర్మీ 1860–1940, బాసింగ్‌స్టోక్ 1994, పే.47–50. 1914 నాటికి అఖిల భారత సైన్యంలో మూడొంతుల మంది సైనికులు పంజాబ్, వాయవ్య సరిహద్దు ప్రాంతం, నేపాల్‌ల నుంచి వచ్చారు. పే. 19.

సైన్యంలో అక్కడి స్థానికులు సైనికాధికారులుగా నియమించబడేవారు. కానీ బ్రిటిష్ ఇండియాలో భారతీయులకు సైనికాధికారులుగా పదోన్నతి పొందే అవకాశం మొదటి ప్రపంచ యుద్ధం తరువాత చోటు చేసుకున్న పరిణామాల తర్వాత మాత్రమే లభించింది.

యుద్ధాలు లేని శాంతియుత కాలంలో భారత సైన్యంలో మొత్తం సైనికుల సంఖ్య రెండు లక్షల నుంచి రెండున్నర లక్షలుగా వుండేది. బ్రిటిష్ రాజ్యంలో అత్యధిక ఉపాధి అవకాశాలను కల్పించింది సైన్యమే. అదేవిధంగా దేశ రాబడిలో సగం నుంచి మూడొంతుల వరకూ సైన్యానికే ఖర్చయ్యేది. భారత సైన్యాన్ని తరచూ విదేశాలలో వినియోగించేవారు. శాలిస్‌బరీ చెప్పిన ఈ మాటలు ఎంతో ప్రసిద్ధమైనవి: "తూర్పు భాగంలో వున్న మన బ్రిటిష్ శిబిరం భారత సైన్యమే. ఆ శిబిరం నుంచి మనం ఎప్పుడంటే అప్పుడు పైసా ఖర్చులేకుండా ఎన్ని సైనిక బలగాలనైనా తెప్పించుకోవచ్చు." పశ్చిమాసియా, ఆఫ్రికా, ఆగ్నేయ ఆసియాల్లో బ్రిటిష్ సామ్రాజ్య విస్తరణకు తోడ్పడడం అనేది కూడా ఆ సైనికుల విధుల్లో వుండేది. మొదటి ప్రపంచ యుద్ధంలో వీరు పెద్ద ఎత్తున బలిపశువులయ్యారు. అప్పుడు పదమూడు లక్షల మంది సిపాయిలు వినియోగించబడ్డారు. అయితే ఆ సిపాయిల ప్రధాన లక్ష్యం మాత్రం స్థానిక ప్రజల్ని అదుపులో వుంచడం. ప్రజల్ని భయపెట్టి, బలప్రయోగంచేసి బ్రిటిష్ పాలన సజావుగా సాగేట్టు చూడడం. సైన్యానికి సంబంధించిన శిబిరాలు దేశమంతటికీ విస్తరించి వుండేవి. ఈ దేశాన్ని ఎవరు పాలిస్తున్నారో ఆ సైనిక శిబిరాలు జనానికి సదా గుర్తుచేస్తుండేవి. వాయవ్య ప్రాంతంలో ఆఫ్ఘనిస్తాన్‌ను అదుపుచేసేందుకూ, సరిహద్దులను కాపాడేందుకూ, అదేవిధంగా రష్యన్‌లు ఎక్కడ దాడి చేస్తారో అన్న భయంతోనూ అక్కడ భారీగా సైనిక బలగాలను మోహరించేవారు. అయినప్పటికీ దేశ అంతర్గత భద్రతకు అధిక ప్రాధాన్యత ఇచ్చేవారు. అందుకు స్థానిక సైనికులను కాకుండా బ్రిటిష్ బలగాలనే ఎక్కువగా ఉపయోగించేవారు. సరిహద్దు యుద్ధాలకోసం మాత్రం స్థానిక సిపాయిలను పెద్దఎత్తున తరలించేవారు. గూర్ఖా సైనికులు భారత్‌కు పరాయివారు కాబట్టి వారిని వాడుకునేవారు.[10] దీనికి తోడు పోలీసు వ్యవస్థలో 1880ల నాటికే 1,50,000 మంది శాశ్వత ఉద్యోగులుగా పనిచేసేవారు. స్థానికంగా అణిచివేత కార్యక్రమాల్లో వారు అగ్రగాములుగా వుండేవారు. బ్రిటిష్ రాజ్యం మొదటి నుంచీ చివరి వరకూ ఒక సైనిక రాజ్యంగానే కొనసాగింది. 1942లో వైస్రాయ్ మంత్రివర్గానికి ఇలా చెప్పారు: "భారత్, బర్మాలు బ్రిటిష్ సామ్రాజ్యానికి సహజ సంబంధమున్న దేశాలు కావు. జాతి, చరిత్ర, మతాల పరంగా అవి పరాయి దేశాలే.

---

10. 'ది సిపాయ్ అండ్ ది రాజ్', పే.209 క్రిస్టోఫర్ బేలీ అండ్ టిమ్ హార్పర్, 'ఫర్గాటెన్ వార్స్'. 'ది ఎండ్ ఆఫ్ బ్రిటన్స్ ఏసియన్ ఎంపైర్', లండన్ 2007, పే.406.

**End of Preview.**

**Rest of the book can be read @ [http://kinige.com/book/Indialo+Dagina+Hindusthan](http://kinige.com/book/Indialo+Dagina+Hindusthan)**

* * *